# సత్యభామ నోము

ఆ రోజు ద్వారకలో ఎక్కడ చూసినా సందడే పట్టుచీరల రెపరెపలతో పాటు నూలుచీరల గరగరలూ బాగా వినిపిస్తున్నాయి. చేతిగాజులు ఘల్లుఘల్లుమనేలా కొందరు అతివలు మాట్లాడుతూ వుంటే కాలి అందెలు ఘల్లుఘల్లు మనేలా కొందరు ముందయానలు అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. ఇంతకీ ఆనాటి విశేషం!

శ్రీ రుక్మిణీదేవి నోము నోముకుంటున్నది. ఆ నోముకి లక్షణ, జాంబవతి, మిత్రవింద, కాళింది, భద్ర, నాగ్నజితి ఆరుగురు చెల్లెళ్లూ వచ్చారు అక్కగారి సాయానికి.

రానిదల్లా భామామణి, భార్యామణి అని పేరు తెచ్చుకున్న శ్రీ సత్యభామాదేవిగారే! ఆవిడ గారెందుకు రాలేదు అంటే చాలా చిన్న సమాధానం. శ్రీ రుక్మిణీదేవిగారు ఆమెగారిని పిలవలేదు. ఎందుకంటే పిలవదలచుకోలేదు.

సత్యావిధేయుడట శ్రీ కృష్ణుడు ఆయనగారు ఆవిడగారి కాలి అందె, చేతి కంకణం అట! చూద్దాం! ఆయనగారిని శ్రీ రుక్మిణీనాథుడు అని పిలిపించకపోతే - నేను రాచబిడ్డనేకాను. అని మనసులోనే ప్రతిజ్ఞ చేసుకుంది ఆమె శాంతురాలు, సహనవతి అయిన శ్రీ రుక్మిణీదేవి గారికి అంత కోపం వచ్చిందంటే రాదూ మరి! ఆనాడు ఆయనగారు అష్టపత్నులతో జలకేళికి యమునకు బయలుదేరారు. ఎప్పుడు వెళ్ళినా పెద్ద దిక్కుగా వచ్చే బలరాములవారూ రాలేదు, ఆయన ఇల్లాలు రేవతిగారూ రాలేదు. ఇంకేముంది, అంతా పెద్దల్లేని పండుగ, హద్దుల్లేని వేడుక అయింది. శ్రీకృష్ణుణ్ణి శ్రీ సత్యభామాదేవి నల్లకలువతో కొట్టింది. ఇంకా విరిసీ విరియని ఆ కళిక నల్లనయ్యకి తగిలేసరికి ఆయన ఇంకా నల్లబడినట్లు అన్పించింది.

'ఏమిటమ్మా! మొగుడన్నాక కాస్త భయమూ భక్తీ ఉండాలి! హద్దూ పద్దూ లేకుండా అలా కలువతో బంతాడడమేనా? అంది శ్రీ రుక్మిణీదేవి నిష్ఠూరంగా.

భర్తముఖాన్ని అరచేతుల్లోకి తీసుకుని అరవిందాల్లాంటి చేతులతో కలువ రేకులాంటి ఆయన చెంపల్ని నవరిస్తూ ఉంటే, ఇదై పోయి పరవశంతో ఆ చేతుల్ని అలాగే తన పెదాలతో సుతారంగా స్పృశించారు శ్రీ కృష్ణులవారు.

ఇంకేముంది! అసలే అనమానం ఆపై ఆయన గారి అభిమానం. అగ్గిమీద గుగ్గిలమైపోయింది సత్యభామ.

'జలక్రీడలంటే నీళ్ళల్లో స్నానాలు చేసి వెళ్లడం కాదక్కయ్యగారూ! మన సైన

మగవాడితో సయ్యాటలాడుకోవడం! అని భర్తవంక రుసరుసలాడుతూ చూసి 'ఉలుకూ పలుకూ లేకుండా అలా ముంగిలా ఉండి పోయారేం! చెప్పండి ఆవిడగారికి అంటూ శ్రీకృష్ణుణ్ణి మరోసారి లీలాకోరకంతో కొట్టింది. ఆ పుప్పొడి శ్రీకృష్ణుల వారి కళ్ళల్లోకి చిమ్మి ఆయన కళ్ళల్లో నీళ్ళుతారాడాయి.

అయితేనేం ఆయనగారు కిమ్మనలేదు -

ఇదిచూసిన శ్రీ రుక్మిణీదేవి గారు మాత్రం చక చకా నీళ్ళల్లోంచి గట్టుమీదికి వచ్చేశారు. అది చూసి కూడా ఆయనగారు తిరిగి రమ్మనలేదు. దాంతో మిగిలిన ఆరుగురు భార్యలూ శ్రీ రుక్మిణీదేవి వెంట నడిచారు.

ఏడిచారు! ఏడిచేవాళ్ళని ఏడవనీ...అనుకున్న సత్యభామ భర్తగారి చేయిపట్టుకుని బరబరా లాక్కెళ్ళింది, మరింత లోపలికి.

వాళ్ళనంటే ఈమెకు సంతోషం ఈవిడ్ని అంటే వాళ్ళకు సంతోషం. కానీ ఆయనకు మాత్రం అందరి సంతోషాలూ కావాలి. అందుకే వాళ్ళనీ అన్లేదు. ఆవిణ్ణీ అనేదు. [illegible] చూస్తుండిపోయాడు. జల క్రీడల్లో మునిగి[illegible]

ఆరోజు అదయ్యాక ఏడుగురూ కలిసి శ్రీ రుక్మిణీదేవి మందిరంలో సమావేశమయ్యారు.

'ఏదో చేసెయ్యాలి! ఆయన్ని ఆమె ఆకర్షణ నుంచి తప్పించాలి!'

"పుణ్యకవ్రతం అంటూ ఆవిడ ఆరోజు నోము నోచి శ్రీ నారదులవారి[illegible] తిరిగి కొనుక్కోవడం ఆవిడతో అయ్యిందా? మళ్ళీ అక్కయ్యగారే తులసీ దళం వేసి తూచేదాకా నాథుడు అనాథుడిలా నారదుడి చేతిలో బందీగా ఉన్నారు" అంది జాంబవతి.

'మరొట్టి ఆడపిల్లవి! నీకేం తెలీదమ్మా! ఆవిడేదో మందో మాకో పెట్టి ఉంటుంది' అంది మిత్రవింద.

'ఛ! ఛ! మందులూ, మాకులూ ఏంలేదు! అసలాయన్ననాలి! పట్టమహిషి అక్కయ్యగార్ని కాదని ఆమెని పట్టుకుని ప్రాకులాడుతున్నారంటే లోపం ఆయనదే!' అందిలక్షణ

నిట్టూర్చింది శ్రీ రుక్మిణీదేవి.

ఉన్నట్టుండి ఆవిడకేదో ఆలోచన స్ఫురించింది. 'ఇదిగో వినండి! దీపావళి వస్తుందంటే అదావిడ పండుగ! మగరాయుళ్ళా వెళ్ళి బాణాలు పట్టుకుని యుద్ధం చేసి వీరనారిగా వస్తుందిగా అందుచేత దానికంటే ముందే మనం ఓ నోము నోచాలి! అది ఆడవాళ్ళ పండుగే కావాలి! మనం అంతా కలిసికట్టుగా నోచుకుంటే సరి ఇక్కడే ఉండిపోతారు.'

అంతా సరేన్నారు. అందరి అంతఃపురాలూ ఒక కోటలోపలే ఉన్నాయి. ఆ సాత్రాజితి ఒకర్తె మాత్రం వేరే కోట కట్టుకుంది.

'ఏం చేద్దాం' అంది రుక్మిణి

'ఏ నోము నోద్దాం' అంది కాళింది.

' నానోమా?' ఆశ్చర్యంగా అంది రుక్మిణి.

'అవునక్కయ్యా! ఈ శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నోచుకుందాం! ఆ లక్ష్మి

అవతారమే కదా నువ్వు నువ్వు నోచుకుంటే మాకు నోచుకున్నంత పుణ్యం దక్కుతుంది.'

ఆ మాటకు అందరూ సంతోషిస్తే శ్రీ రుక్మిణీ దేవి చిరునవ్వు నవ్వింది. ముసిముసి నవ్వుల మధ్య ఆ శ్రావణంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నోచుకోవాలని నిర్ణయించుకున్నారు.

వెంటనే చెలికత్తెలకు ఆజ్ఞలు జారీచేశారు.

అదో - ఆ రెండో శుక్రవారం ఈ రోజే-

కబురు వెళ్ళింది. కన్నయ్య వచ్చారు. భార్యాభర్తలు ఇద్దరూ పీటలమీద కూర్చుంటే, మిగిలిన ఆరుగురూ అక్కగారి వాటున కూర్చున్నారు. శ్రీ కృష్ణుడు బుద్ధి మంతుడిలా శ్రీ రుక్మిణీదేవి ప్రక్కనే కూర్చున్నాడు.

శ్రీ నారదమహర్షి నోము నోపించారు. వాయనాలు ఇప్పించారు.

'అమ్మా! ఆ యుగంలో మీరు శ్రీ లక్ష్మీ నారాయణులు తిరిగి మిమ్మల్ని ఈ యుగంలో ఈ రోజు ఇలా చూస్తున్న నా రెండుకళ్లూ ధన్యమయ్యాయి. నా జన్మ చరితార్థమైంది' అన్నాడు.

ఆరోజు కుడుములూ, పచ్చి శనగలూ, అరటి పళ్ల దానాలతో వీధి వీధేమిటి నగరు నగరేమిటి ద్వారకంతా పరిమళించింది.

రాత్రైంది.

శ్రీకృష్ణులవారి రాకకోసం ఎదురు చూసిచూసి రెండో జామున సొమ్మసిల్లింది. శ్రీ సత్యభామా దేవి.

తెల్లగా తెల్లారింది.

శనివారం.

సుబ్బరంగా ఆయన గారికి సంపెంగతైలంతో తలంటుపోసి పట్టు పీతాంబరాలు కట్టించి పూజ. చేసుకోవడం సత్యభామాదేవికి అలవాటు. అందునా ఆ రోజు శ్రావణ శనివారం.

బోలెడు దుఃఖం వచ్చిందామెకి పొద్దెక్కి రెండు జాములైనా రాని భర్తని గురించి తలపోసి తలపోసి మిట్ట మధ్యాహ్నం అలా చెంబెడు నీళ్లు గుమ్మరించుకుని తడిపొడిగా తుడుచుకుని ఒంటిచీర చుట్టుకుని పూజా మందిరంలోకి వెళ్లి కొబ్బరికాయ కొట్టి హారతిచ్చి ఇంత తీర్థం, ప్రసాదం పుచ్చుకుని వెళ్లి మంచం మీద వాలిపోయింది. పొద్దు వాటారి చీకటి పడినా శ్రీ కృష్ణదేవుడు రాలేదు. సత్యభామాదేవి గుక్కెడుపాలు పుచ్చుకుని పడుకునిపోయింది.

తెల్లారింది. ఆదివారం - ఆయన రాలేదు.

రోజు గడిచింది. సోమవారమూ రాలేదు.

మరురోజు మంగళవారమూ రాలేదు.

అయిదు రోజుల అయిదు యుగాలుగా వుంది శ్రీకృష్ణుడికి. ప్రతిపూటా ఎవరో ఒకరు వచ్చి అమ్మగారి గురించి పట్టమహిషి చెవిలో వేసిపోతున్నారు. గుండెల్లో కలుక్కుమంటున్నా

ఆమె గుంభనంగా వుంది, మాద్దాం అన్నట్టు.

కానీ శ్రీకృష్ణుడు ఉండలేకపోయాడు.

ఆ ఇంటికి బయల్దేరాలని లేవాడు.

సరిగ్గా అప్పుడే -

అయిదు రోజుల విరహంతో, పది పూటల నిరాహారంతో నీరసించి మేలిమి మేని బంగరు కాంతులు మరింత పస్నెకెక్కగా చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టు పలచబడిన చెక్కిళ్ళకు మందారంలాంటి అరచేయి ఆన్చుకుని వింటోంది - సత్యభామాదేవి.

ఎదురుగా నారదుంవారు.

'అదమ్మా సంగతి! నువ్వు రేపు శుక్రవారం నోచుకో - ముచ్చటగా మూడోవారమే నోచుకోవాలి. తొందరపడి రెండోవారం నోచినా ఆలసించి ఆఖరు వారం నోచినా వ్రతం దక్కినా ఫలితం అంతంత మాత్రమే'

ఉస్సురుమని నిట్టూర్చింది. ఆ నిట్టూర్పులో అల, ఆ పురంలో ఆ నగరిలో ఆ మూల సౌధంలో ఉన్న ఆయనగారికి రమ్మన్న అమ్మగారి ఆహ్వానం అందించే దెవరు? అన్న భావం పలికింది.

తంపుల మారినని ఎలాగూ నాకు బిరుదు ఇవ్వనే ఇచ్చారు. నా మీద ఆ భారం వేయండి అయ్యగారి చెవిన వార్తవేస్తాను. వారొస్తారు అన్నారు నారదుం వారు.

తలూపింది రాజసంగా -

నారదుడు అక్కణ్ణించి రుక్మిణీదేవమ్మ నగరు వచ్చేసరికి శ్రీకృష్ణుల వారు ముభావంగా ఉన్నారు. ముఖాన మందహాసం లేదు గదా ఎక్కడో కనుబొమల చాటున కోపరేఖ తొంగి చూస్తోంది.

'మహానుభావా! మొన్న ఇక్కడ నోము నోయించాను. రేపు శుక్రవారం చిన్నమ్మ గారూ ఉభయం చెప్పారు' అన్నాడు, నారద మహర్షి, నాంది నాటకం స్వస్తి అన్నీ అందులోనే ధ్వనిస్తూ.

ఆయన అమ్మగార్లవైపు చూశారు.

ఎవరు కాదనగలరు?

లోలోపల ఎంత ఇదివున్నా ఆవిడా తమలాగే ఆయనగారికి ధర్మపత్ని.

శ్రీకృష్ణుల వారు కళ్లతో మాట్లాడి కనుసైగలతో సెలవు తీసుకుని వెళ్ళారు.

ఉసూరుమన్నారందరూ.

ఆరోజు మూడో శుక్రవారం. మొత్తం ద్వారక వీధులన్నీ శుభ్రం చేయించి పన్నీటి నీళ్లు చలింపించింది. ముత్యాల ముగ్గులు పెట్టించింది. ఇంటింటికీ తోరణాలు, గడపగడపకూ బంగారు రేకులు వేయించింది.

అది చూసిన వారు ఆవిడగారికేమమ్మా శమంతక మణి ఇంట్లోనే ఉంది అన్నారు.

శమంతక మణేమిటి? ఆ భార్యామణి ఇంట్లోనే కొంగుబంగారంలా శ్రీకృష్ణదేవుడున్నాడు అన్నారు కొందరు.

ఆమె, ఆమె వెంట దాస దాసీజనం అందరికీ తల మానికంగా రాధాదేవి ఇల్లిల్లూ తిరిగి ప్రతి ఇల్లాలినీ బొట్టుపెట్టి బంగారుభరిణె ఇచ్చి పేరంటానికి పిలిచారు.

వాళ్లు నన్ను కాదన్నారు. నేనలా చేస్తానా అన్నట్టు అక్కగారిని, చెల్లెళ్లనూ కూడా పిలిచింది.

వ్రతానికి ఊరు ఊరంతా వచ్చింది.

ఇంట్లోకాక ఇంటిముందు ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగూ వేయించింది. మధ్యన ముత్యాల ముగ్గు వేయించి అందులో బంగారుపీటలు పరిచింది. అవీ మూడే ఉన్నాయి.

వాటి చుట్టూ ఏడు ఆసనాలు-

వాటికి అభిముఖంగా రెండు పెద్ద ఆసనాలు.

అందరి కళ్లూ కుట్టేలా బంగారు పీటల మీద వాళ్లిద్దరూ కూర్చున్నారు. మరో పీట మీద నారద మహర్షి, ఏడు ఆసనాల్లో సపత్నులు - పెద్ద సింహాసనం లాంటి ఆసనాల మీద దేవకీ వసుదేవులు - వాళ్ల వెనక బలరాములవారు, రేవతి నిలబడే చూశారు వేడుకంతా.

నోము అయ్యాక పేరంటానికి వచ్చిన ముత్తైదువలందరికీ బంగారుగొలుసు తాళిబొట్టుతో దానమిచ్చింది, ప్రత్యేకంగా నేయించి తెప్పించిన గద్వాల, నారాయణపనం, చీరలు వాయనం ఇచ్చింది. ప్రతి ముత్తైదునతో వాళ్లాయనికి పొందూరు ఖద్దరు పంచో, నారాయణపనం జరీ అంచు పంచో జతగా ఇచ్చింది. రత్నాలు తాపిన వెండి కుంకుమభరిణెలు ఇచ్చింది. రత్నాల బంగారు గాజులు ఇచ్చింది. ఘల్లుఘల్లుమని మ్రోగే మట్టెలు, పాంజీబులు, అందెలు ఇచ్చింది.

పెళ్ళికాని కన్నె ముత్తైదువులకి శ్రీకృష్ణ విగ్రహం దానం ఇచ్చింది. అందరి ముఖాల్లో ఆనంద తాండవమే. ఆఖరికి రుక్మిణమ్మగారి ముఖంలోనూ.... ఆవిడ ఎంత ఇదై పోయిందంటే చెల్లెల్ని అడిగి మరీ తీసుకుంది శ్రీకృష్ణుడి విగ్రహాన్ని.

సత్యభామ కోసం గురించి యుగయుగాలు ఎలా చెప్పుకున్నారో ఆమెగారు నోచిన శ్రావణ శుక్రవారం నోము గురించి అలాగే చెప్పుకున్నారు. చూసిన వాళ్లు మురిసిపోతే, చదివినవాళ్లు సంబరపడితే విన్నవాళ్ళు ఉప్పొంగిపోయారు.

● 1990 ఉదయం వీక్లీ ఉగాది ప్రత్యేక సంచిక ●